


■ దైవస్వరూపులైన తలిదండ్రుల పాద పద్మముల పూజకు నోచుకోలేని అభాగ్యురాలైన మీ 'సునంద' లేఖ.

ఇప్పటివరకు ఎన్నో ఉత్తరాలు వ్రాశాను. ఒక్కదానికీకూడా జవాబు లేదు. అయినా నాకు విసుగు లేదు. వ్రాస్తాను. మళ్ళీ మళ్ళీ వ్రాస్తాను. నాలో ఓపిక సహనం వున్నంతవరకు, నా చేతుల్లో శక్తి, మీపై భక్తి నిలిచివున్నంతవరకు వ్రాస్తూనే వుంటాను.

నాపై మీకందరికీ పగ, ద్వేషం, కోపం అన్నీ వున్నాయని నాకు తెలుసు. మీరు నన్నెంత మూర్ఖురాలిగా, నీచురాలిగా జమ కట్టినా, వంచకిగా, దోషిగా నన్ను మీనుండి పూర్తిగా వెలివేసినా, మీపై అభిమానం, అనురాగం నాలో ఏనాటికి చావవు. అవి మనుష్యులకి వలె ప్రేమాభిమానాలకు మృత్యువాత లేదు

నేను చేసిన పని ఎంతో తుచ్ఛమైనదని, నీచమైనదని మీ రెవ్వరు నిష్ఠూరాలాడినా ఫర్వాలేదు. ప్రపంచమే కోడై కూసినా నేను లెక్కచేయను. నేనెంతో ఆలోచించి చేసుకున్న నిర్ణయమే, నా స్వంత భావాలకు స్వతంత్రమివ్వటంతో పొరపాట్లు

చేయలేదు. కుటుంబ శ్రేయస్సు కొఱకు నేనొక మంచిపని చేసాను, అన్న ఆత్మ సంతృప్తి నన్నెంతో ఉన్నతురాలిగా చేస్తోంది.

మీకు కనిపించకుండా, మాట మాత్రం చెప్పకుండా వెళ్లిపోయే ఆరోజున మీరెంతగా విలపించారో! ఆ తరువాత యెన్ని నిందలను అపవాదులకు, పరుషవ్యాఖ్యానాలకు గురి అయ్యారో అనుభవంమీద నేను తెలుసుకో గలను.

ఎన్నిమార్లు గుండెలవిసేలా ఏడ్చి, ఏడ్చి పిచ్చిగా తలలు గోడకు బాదుకున్నారో ఊహించుకుంటే నా గుండె పగులుతోంది.

నాది రాతిగుండె అమ్మా! ఇది నీకర్థం కాదు. ఆడదాని గుండెలో విషం కూడా ఒక పాలు మిళితమై వుంటుంది. కాకుంటే పసికందునుంచి అల్లారుముద్దుగా, అపరంజిబొమ్మలా పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పినందుకు నా బాధ్యత విస్మరించి, మీ మాట నెదిరించిన కృతఘ్నురాలినిగానా? అదే నా బాధ. కాని బరువు బాధ్యతలను, విమర్శనాత్మకంగా ఆలోచించే జ్ఞానం, ఆచరించగల సమర్థత నాకూ వుంది.

మన ఇంటి ఆర్థిక పరిస్థితులే నన్ను తీవ్రమైన వత్తిడికి గురి చేసాయి. చాలీ చాలని సొమ్ముతో ఏదో గొప్పలకు పోవటం మంచిది కాదనిపించింది. నా పెళ్లి విషయమై మీరు పడే ఆవేదన, ఆందోళన నన్ను నిలువునా కాల్చివేసింది. నేను సంఘంలో ఒక వ్యక్తురాల్నిగా గుర్తింపబడనంతకాలం మీరు నాకే లోటుపాట్లు లేకుండా పువ్వులా పెంచుతూ వచ్చారు. అన్నయ్యకు ఉద్యోగం దొరికింది. నాన్నగారి జీతం హెచ్చింది. డబ్బుకు కొదువ లేదు. నా జీవితం నందనవనంలా విరాజిల్లింది.

కావలసినన్ని దుస్తులు. నైలాన్, వాయిల్, మఖ్‌మల్ ధరించి, రకరకాల స్టైల్స్ చేసేదాన్ని. నేనేది కోరితే అలా నిముషంమీద తెచ్చి యిచ్చేవారు. ఊళ్లోకి కొత్త సినిమా వస్తే చాలు మొదటి ఆటకే అడ్వాన్సు టికట్ తీసుకొని మరీ వెళ్లేదాన్ని. ఎన్నోమార్లు నాజన్మదినోత్సవాలకి ఎన్నెన్ని పిండివంటలు, మిఠాయిలు నానోటి కందించారు. అప్పట్లో నా ఆనందానికి అవధులు లేకపోయాయి. స్నేహితురాండ్ర సందర్శి పిలిచి పార్టీ చేస్తానని మీతో మారాం చేసినా ససేమిరా ఒప్పుకోలేదు. కోపంతో నేను అలిగి పరుండిపోయానని అన్నయ్య అప్పటికప్పుడు అన్ని అయిటమ్స్ అరేంజ్‌చేసి నన్నెంతో సంతోష పెట్టాడు.

నా నవ్వే మీకొక పండగలాగుండేది. మరోమారు నా వేలి వుంగరం ఎక్కడో జారిపోయిందని మీతో చెప్పలేక భయపడి బెంగపెట్టుకుంటే, అమ్మా! నీ వుంగరాన్ని నా చేతికి తొడిగి నన్నెంతగనో లాలించావు కదా అమ్మా!

నా ఆనందంకోసం మీ రెన్నడూ దేనికి వెనుకాడలేదు. ముగ్గురన్నయ్యల తరువాత ఆడపిల్లనని ఎంతో గారాబంగా పెంచారు.

ఆ తరువాత నేను సమాజంలో ఒక రోజు వ్యక్తిగా పరిగణించబడ్డాను. స్త్రీగా నాకొక ప్రత్యేకత ఏర్పడింది. కాలేజీలోజేరి చదవ నారంభించాను. ఆ ఏడు అన్నయ్య పెళ్లికూడా జరిగింది. అన్నయ్య వేరుపడ్డాడు. మిగతా ఇద్దరన్నయ్యలు ఉద్యోగాన్వేషణకై వూళ్లు పట్టేశారు. కొద్ది రోజులకే నాన్నగారు రిటైరయ్యారు. అన్నయ్య వేరుపడటంతో ఇంటికి డబ్బు ఇవ్వటం మానుకున్నాడు.

బరువు, బాధ్యత నెత్తిన పడగానే స్వతంత్రులవుతారు. ఎవరిది వారే నన్న తలంపుకు వస్తారు గాబోలు.

ఊళ్లు పట్టేసిన ఇద్దరన్నయ్యలకు ఆ సంపాదించుకున్న జీతం రాళ్లు వాళ్ల తిండికే సరిపోవటంలేదని ఉత్తరాలు వ్రాసేవారు.

నాన్నగారికి వృద్ధాప్యం దాపురించింది. రిటైరవగా, ఆ వచ్చే డబ్బుతో ఇల్లు కట్టారు. అదే నేటికి మనపాలిట దేవతయ్యింది.

అప్పట్లో నా పెళ్లి ప్రసక్తి వచ్చినా కట్నం గురించి అంత తీవ్రంగా ఆలోచన రాలేదు. ముగ్గురన్నయ్యలకు ఒక్కగానొక్క చెల్లెలు ఆ మాత్రం ఆదుకో— లేరా? తలోక చేయివేసి అక్షింతలు జల్లరా? అనే ఆలోచనతో అన్నయ్యలపై పూర్తి విశ్వాసంతో ఇంటి నిర్మాణానికి పూనుకున్నారు.

ఇప్పుడు ఆ ఇల్లే లేకపోతే నడిబజారులో నగుబాటు పడేవాళ్లం. పరిస్థితులు విషమించాయి. రాబడి పూర్తిగా తక్కువై పోయింది. పెద్దన్నయ్య పూర్తిగా ఇంటి ఛాయలకే రావటం మానుకున్నాడు. వదిన మాట జవదాటలేని అన్నయ్య అసమర్థుడయ్యాడు.

తల్లిదండ్రులపై దయాదాక్షిణ్యాలు కరువయ్యాయి.

ఆ ఏడు పరీక్ష ఫీజు కట్టవలసి వున్నా మిమ్మల్ని అడగలేక పోయాను. మీ దైన్యావస్థ చూచి నా నోరు పలుకలేదు.

పరీక్షకు వెళ్లకుండా వెళ్ళానని అబద్ధమాడదామనుకున్నాను. కాని మరో ఆపద్బాంధవుడు ఆదుకుని నన్నెలాగునో గట్టెక్కించాడు.

పి. యు. సి. పరీక్ష పాసయ్యాను. ఆర్థిక పరిస్థితుల ఇబ్బందులవల్ల నేను పైచదువులకు నోచుకోలేక పోయాను.

ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో మీరు నాకు పెళ్లి సంబంధాలు చూడసాగారు. ఆ వెదికే సంబంధాలు కూడా మనకు సరితూగేవి కాకుండా, నే నేదో సుఖపడి పోవాలని, పెద్దవాటికి, పై అంతస్థులకే పరుగులు పెట్టేవారు.

ఎంతచెట్టుకి అంతే గాలి వుండాలని నేనెన్నిమార్లు మొరపెట్టుకున్నా మీ చెవికెక్కలేదు.

పెళ్లిచూపులకు పెద్ద అట్టహాసాలు, అప్పులుచేసి జరిపించి తృప్తిపడేవారు. అడ్డుపడితే అపశకునపు మాటలు కూడదని తిరిగి నన్నే తూలనాడేవారు.

పెళ్లిచూపులవారు వచ్చినట్లే వచ్చి ఏదో వంకపెట్టి మెల్లగా జారుకునేవారు.

అప్పుజేసిన డబ్బు తిరిగి తీర్చే శక్తి లేకపోయేసరికి వడ్డీలు కొండంతగా పెరిగిపోయాయి. దీనంగా ఒకరి ముఖాలొకరు చూచుకోవటం తప్ప యింకేమీ చేయలేక పోయాం.

అలా ఎన్నో సంబంధాలు తుడుచుకు పోయాయి. మరికొందరు అన్నీ జరిగాక కట్నాల దగ్గర మాత్రం కీచకులు, కిరాతకులుగా మారిపోయేవారు.

'వియ్యమైనా కయ్యమైనా సరిసమానంగా తూగాలండి' అని వోమారు ఒకాయన నాన్నగారితో అన్నాడు.

మన పరువు, ప్రతిష్ట ఎన్ని అంగుళాల మేరకు భూమిలోకి క్రుంగిపోయిందో,

నాగుండె లెన్ని చెక్కలైందో, నాకన్నీళ్ళు ఎన్ని కడవలై నా పైటను తడిపివేసాయో మీరు ఏమాత్రం ఊహించి వుండరు.

ఒకరోజు అర్ధరాత్రి మీరిద్దరు ఏదో మాట్లాడుకుంటున్న సమయాన మంచినీళ్ళకని లేచి అటు వైపుగా వచ్చాను. మీ సంభాషణ విని చకితురాలనయ్యాను.

నా గుండెల్లో నిజంగా దడ బయలుదేరింది. నాకెందుకో ఈ ఆడజన్మమీద అసహ్యం వేసింది. రోషం పుట్టుకొచ్చింది.

పుణ్యమైన స్త్రీలెప్పుడూ గొప్ప అంతస్థుల్లోనే జన్మిస్తారు గాబోలు.

శ్రీమంతుల వంశంలో జన్మించని స్త్రీ జీవితం పురుగుకన్నా హీనమవుతుంది.

మధ్యతరగతులలో పుట్టి పెరిగిన ఆడపిల్లల బ్రతుకులు అస్తవ్యస్తమైనవి. అయోమయమైనవి.

త్రాగుతున్న మంచినీళ్లల్లో ఆ క్షణాన ఏ విషక్రిమైనా పడి చస్తే పీడ విరగడయిపోను.

ముందు వెనుక ఆలోచనలేకుండా నాకోసం మీరెంతటి త్యాగానికైనా ఒడిగడుతున్నారు.

నాకు పెళ్లి చేయాలంటే ఒక్కటే మార్గం వుంది. లటి ఉన్న ఇల్లు కాస్తా అమ్మజూపటం. అదే మీ స్థిర ఆలోచన.

# తెగింపు

ఆ డబ్బుతో, ఏ పురుష పుంగవుడి చేతిలోనో కట్నం రూపంగా ధారపోస్తే, అతగాడు నన్నొక బానిసగా బ్రతికినన్నాళ్ళు కలిసి గడపమంటాడు.

కట్నం లేకుండా నాకు పెళ్లి జరగదట. ఏ పురుషోత్తముడు అంతటి ఔన్నత్యమైన పనికి పూనుకోలేడట. అలా దిగిరావటం అసంభవమని మీ ఊహ.

దేశం గొడ్డుపోయిందా?

ఇల్లు అమ్మి వీధి అరుగులో నెత్తిన గుడ్డ వేసుకొని తలిదండ్రులు దేవులాడుతుంటే ఆ ధనంతో నేను రాజయోగాలు అనుభవించాలా?

మీరు కూడుగుడ్డలకు అలమటిస్తున్నా ఫర్వాలేదు. తీయటి మాటకు, చల్లని చూపుకు నోచుకోలేకపోయినా ఫర్వాలేదు. నేనుమాత్రం సర్వసౌఖ్యాల్ని పొందాలా?

ఇదెక్కడి అనురాగం! ఇదేమి అనుబంధం?

కన్నకడుపు తీపికొఱకు ఎంతటి దారుణానికైనా వెనుదీయరన్నమాట!

మమతకు, మానవత్వానికి మరోరూపం మీరు.

నేను గుండెలపై కుంపటినికాబోవడదు, నేనంత దురదృష్టవంతురాల్నిగాను మంచి మానవత్వం లేని మానవుల చేతుల్లో నలిగి నశించిపోయే దుర్గతి నాకూ వుంది.

అన్నయ్య మూర్ఖుడై, బాధ్యతారహితుడైనంత మాత్రాన, నేను తల్లిదండ్రులకు విధేయురాలిగా, వారి బరువు, బాధ్యత వహించకూడదా?

నన్ను వదిలించుకోవటానికి ఎందుకింత యాతన పడుతున్నారు. దూరంగా వెళ్లిపోయిన అన్నయ్య ప్రేమభిక్షకొరకు అంతగా ప్రాధేయపడుతున్నారేమిటి?

ఆడపిల్ల ఎదిగిన కొలది ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిదని ఆలోచించే వాళ్లను చూస్తుంటే, నాకెందుకో చిన్నతనమనిపించింది.

అంతా అయోమయంగా తోచసాగింది. అర్థంకాని అవస్థలో పడిపోయాను.


మీరు ఇల్లు వెచ్చించటానికే చివరి నిర్ణయం చేసుకున్నారు. ఆ డబ్బుని కట్నం రూపంలోపోస్తే నేనేదో సుఖపడిపోతానని భావించారు. కాని మీ భవిష్యత్తు మరింత భయంకరంగా తయారవుతుందని ఊహించుకోలేకపోయారు.

నాకోసం మీ సర్వస్వాన్ని త్యాగం చేయటం నాకేదో బలహీనతగా తోచింది. నేనంతటి పాపాత్మురాల్ని గాలేను.

ఆడపిల్ల అంత బరువుగావుంటుందని, పరో మగవాడి చేతుల్లో (చచ్చినా, బ్రతికినా) వుంచటానికి నిద్రాహారాలు మాని, రాత్రీ పగలు అదేపనిగా విరామం లేకుండా ఆలోచిస్తుంటారని నేనప్పుడే తెలుసుకున్నాను.

నా పెళ్లి పెటాకులకోసం మిమ్మల్ని అంతటి భయంకరంగా చిత్రహింసకు గురి చేయలేను. మీరు పిల్లల్ని సుఖపెట్టాలని ఎంతగా ఆలోచిస్తున్నారో అంతకు పదిరెట్లు మిమ్మల్ని వృద్ధాప్యంలో పిల్లలు ఆదుకోవాలి, అప్పుడే నిజమైన మానవత్వానికి అర్థం పరమార్థం వుంది.

మీరు నాకు పెళ్లిచేయనిదే నిద్రపోరు. తిండి సహించదు. విచారంతో క్రుంగి కృశించిపోతున్నారు. నాకు పెళ్లి చేయాలంటే ఇల్లు అమ్మక తప్పదు. అమ్మినా నన్ను పువ్వుల్లోపెట్టి పూజించగలిగే భర్త వస్తాడని నమ్మకమేమిటి? కట్నాలకు కుమ్మరించిన తరువాత చూడవలసినది, మగవాడి ఉద్యోగం, అందం మాత్రమే



కాదు; అతడి గుణగణాలు; వేషాలు; దోషాలు చూడాలి. తెలుసుకోవాలి.

ఎన్నేళ్ళో పరిచయం కాకపోతే అవి గమనించగలరు. గుర్తించగలరు!

ఏమి చేసినా మీరు నాకు స్వేచ్ఛ నివ్వలేరు. ఇన్నాళ్ళకు అజ్ఞానం అనే చీకటి ముసుగు తొలిగిపోయింది.

మీరు సుఖపడాలంటే నేను దూరంగా పారిపోవటం ఒక్కటే శ్రేయస్కరమైన మార్గం. ఆ విధంగానైనా మీరు కట్టించుకున్న ఇంట్లో శాంతిగా బ్రతికినన్నాళ్ళు నిడపరుచుకుంటారు.

ఆ ఆలోచనే నన్ను నా ప్రియతముడి దగ్గరకు చేర్చింది. వర్ణాంతరాన్ని నేను ఖాతరు చేయను. జాతి విచక్షణా భేదం నాకు లేదు. అదంటే నాకు మంట.

నా హితవు కోరే వాడు, నన్ను ప్రేమతో, అనురాగంతో లాలించి బుజ్జగించేవాడు. నా ఆపద సమయాల్లో ఆప్యాయతతో ఆదుకునేవాడు నాకు కావాలి.

అలాంటివాడే అసలు స్త్రీకి భర్త గాని, ఎక్కడో, ఎప్పుడో ముక్కూ మొగం చూడని మగవాడికి పచ్చనోట్లు ఎర చూపి ముడివేయించటం, నిజంగా అది నా దృష్టిలో కిరాతక చర్య కిందే జమ కడతాను.

నాకీ సంఘంపై ద్వేషం, పగ యింకా చల్లారలేదు.

ఈ నాగరికతా సమాజం ఇంకా బాల్యంలోనే వుంది. పెరుగుదల లోపించింది.

ఇది యింకా పైకి, పైపైకి రావాలంటే నాలాంటి స్త్రీలింకా యెంతో ముందడుగు వేయాలి.

# తెగింపు

కట్నాలకై కక్కుర్తి పడే మగరాయళ్ళకు గట్టిగా బుద్ధిచెప్పే సమయం రావాలి. దానికై ప్రతి యువతి ఎదురు చూడాలి. అవసరమైతే ఎదురు తిరగాలి.

అమ్మా! నే నావేశపడుతున్నాను కదూ! నా ఆందోళన అలా వుంది మరి. అసలు నేను చేసిన అంత పెద్ద తప్పేమిటమ్మా? మీ దృష్టిలో అది అంత పెద్ద నేరమయి పోయిందా?

నాకు నేనే, కోరుకుని మీ సమ్మతి లేకుండా పెళ్ళి చేసుకున్నందుకు నాది దోషమే! కాదనగలనా? కానీ ఈ రోజు మీరు అంత హాయిగా మీరు వేసుకున్న నీడలో నిశ్చింతగా గుక్కెడు నీళ్ళు తాగుతున్నందుకు మీకు గర్వంగా లేదూ?

అమ్మా! ఆడపిల్లలకు కట్నం పోస్తేనేగాని పెళ్ళి కాలేదని మంకు పట్టు పట్టే మీలాంటి వాళ్ళందరకూ నా చర్య ఒక గుణపాఠంగ, గుర్తింపుగా నిలుస్తుందమ్మా!

ఆనాడే నాలో ఆ తెగింపే లేకపోతే మీరీనాడింత సౌఖ్యంగా వుండేవాళ్ళా?

కష్టాల్లో కొడుకులు మిమ్మల్ని ఆదుకునేవారా? పరిస్థితులను అవగాహన చేసుకొనే ధైర్యం చేసాను. స్థిరమైన మనస్సుంటే మహా కార్యాలే, సాధించవచ్చు. కొడుకుల సంపూర్ణమైన సహకారంతో, సంతోషంగా మీరు నాకు పెళ్ళిచేయలేరనే నిరాశ, నిస్పృహ నాలో పెరిగింది. అది నామనోవేదనకు దారితీసింది.

పెద్దన్నయ్య వదిన మాటల్ని పెడ చెవినిపెట్టి నాకు పెళ్ళి తలపెట్టలేదు. ఆ ఆలోచనే రానీయడు.

మిగతా అన్నయ్యలు వాళ్ళ పొట్టకే నానాపాట్లు పడుతూ బాధ పడుతున్నా, వాళ్ళకు ఒక పెళ్ళికెదిగిన చెల్లెలుందని గుర్తుంటుందా? వాళ్ళు నాకు పెళ్ళి చేయగలరా? ఎంతటి హాస్యాస్పదంగా వుంటుందో ఆలోచించగలరా?

ఉన్న గూటిని కాస్తా అమ్మి నన్ను మీరు సుఖపెట్టగలరా? మీరు నిశ్చింతగా ఉండగలరా? అంతా భ్రమ. వృథా శ్రమ.

ఇవన్నీ నాపై ఎదురు తిరిగిన బలమైన కారణాలు భయంకరమైన నగ్నసత్యాలు.

వీటన్నిటికి సమాధానాలు నాకు నేనే సరిజేసుకోవాలి. ఆ బరువు, బాధ్యత నాపైనే వుంది. నేనే భరించాలి.

మీపై భారాన్ని మోపి బాధ్యతల్ని విస్మరించటం వివేక మనిపించుకోదు.

అందుకనే, దేనికన్నా గుర్తింపు, తెగింపు వుండాలని తెలుసుకున్నాను.

కనుకనే, నా అంతట నేనే, నాకిష్టమైన వాడ్ని, నన్ను ఇష్టపడేవాడ్ని వివాహమాడాను.

కట్నాని కాశపడని మగవాడుండడు. ఇచ్చేవాళ్ళుంటే పుచ్చుకునేవాళ్ళే కాదూ?

ప్రేమ వివాహాలంటే మీ మాపుల్లో అదో పెద్ద నేరం. ఘోరం కాని కట్నమిచ్చి పెళ్ళి చేయలేని మీరు, ప్రేమ వివాహాలనైనా ప్రోత్సహించలేని మీరు ఏకార్యానికీ పూనుకోకుండా నన్నెలా సుఖపెడతారు? నాకానందాన్నెలా కలిగించగలరు?

ఇవన్నీ గుర్తించే తెగించాను. నాలో ఆ తెగింపు వుంది. నాకు అన్నివిధాలా అనుకూలుడైన భర్తని ఎన్నుకున్నాను.

నా జీవితం ఇప్పుడు సుఖప్రదంగా, హాయిగా, ఆనందంతో— వోలలాడుతోంది.

అనుదినం మీదీవనలకై ఎదురుచూస్తున్నామని మరోమారు గుర్తుకుతెస్తున్నాను.

మా గృహాన్ని మీరొకసారి పావనం చెయ్యండి. మాకు కన్నుల పండువ చెయ్యండి.

సదా మీ శ్రేయస్సునే కాంక్షిస్తున్నాను.

మీ ఆనందమే నా సంతోషం. నా సౌఖ్యమే, మీ క్షేమమే నా ఆశయసిద్ధి. ●

